క్లుప్తంగా

11,369 మందికి కంటి పరీక్షలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమం విజయవంతమైందని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 18 నుంచి మే 18 వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కంటివెలుగు క్యాంపులు నిర్వహించామని, 18ఏళ్ల వయస్సు నిండిన 11,369 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో రీడింగ్ అద్దాలు 778 మందికి, చూపు సమస్య ఉన్న వారు 1,238 మందిని గుర్తించి వారిలో 968 మందికి అద్దాలను పంపిణీ చేశామని, మిగతా 270 మందికి త్వరలోనే అందిస్తామని తెలిపారు. కంటి ఆపరేషన్ అవసరమున్న 518 మందికి పెబ్బేరు పీహెచ్‌సీ నుంచి పంపించి ఆపరేషన్లు చేయిస్తున్నామని తెలియజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వనపర్తి టౌన్: ఇంటి పెద్దను కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. వైద్య పరీక్షల నిమిత్తమై ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ఇటీవల మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగి గోర్ల రామస్వామి (డాక్టర్ రామస్వామి) దశదినకర్మకు గురువారం ఆయన హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు మనోధైర్యంగా ఉండాలని, కోల్పోయిన వారిని తలుచుకుంటూ బాధపడొద్దని సూచించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కమలమ్మ, గిరి, ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు అఖ్తర్, ఖమ్మర్ మియా, బాబా, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య



పెబ్బేరు రూరల్: ప్రైవేటుకు దీటుగా అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు చేరాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. గురువారం శ్రీరంగాపురం మండల కేంద్రంతో పాటు కంభాళాపురం గ్రామాల్లో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల వద్దకు అధ్యాపకులు కురుమూర్తి, కృష్ణమూర్తి, శ్రీదేవి వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లోని సౌకర్యాలను వివరించి, కళాశాలల్లో చేరాలని సూచించారు.

ఐకేపీ వీఓఏలను ఒత్తిడి గురిచేయొద్దు



మదనాపురం: ఐకేపీ వీఓఏలపై ఒత్తిడి చేయడాన్ని ఏపీఎం, సీసీలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం వివిధ రూపాల్లో శాంతియుతంగా సమ్మె చేస్తున్నారని, వారికి పూర్తిస్థాయిలో ఏపీఎం, సీసీలు న్యాయం చేసి వేతనాలు పెంచేందుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వీఓఏలు డ్యూటీలోకి రాకపోతే తొలగిస్తామని హెచ్చరికలు చేయడం మానుకోవాలని హితువు పలికారు. ప్రభుత్వ పరంగా సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఐడీ కార్డులను ఇవ్వాలని కోరారు. గ్రామ సంఘం నుంచి గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మదనాపురంలో వీఓఏలు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించారు. వీఓఏల సంఘం ఉపాధ్యక్షుడు మన్యం, సహాయ కార్యదర్శి రజిత, కోశాధికారి జమ్ములు, వీఓఏలు జయమ్మ, పద్మ, శ్రీలత, శ్రీవాణి, అరుణ, రూప, నారాయణ, మునికుమార్ పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి

పెద్దకొత్తపల్లి: కాలుష్య నివారణ కోసం కృషి చేయాలని బీడీఎస్ చైర్మన్ సామ్యానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో జీకెఎఫ్ టీఎం టెక్ సంస్థ, కార్బన్ క్రెడిట్ సంస్థల ఆధ్వర్యంలో సమావేశంలో రైతులతో మాట్లాడారు. వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కాలుష్యాన్ని నివారించడానికి ఉచిత కార్బన్ క్రెడిట్ నగదు రూపంలో సహాయపడుతుందని తెలిపారు. గ్రామాలలో సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి 5 మొక్కలు నాటే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం, రమేష్‌నాయక్, నరేష్ రాథోడ్, శ్రీనివాస్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఆత్మకూర్: వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. గురువారం పట్టణంలోని శ్రీరామ ట్రేడర్స్, మహేశ్వరి ట్రేడర్స్, జువారిఫార్మ హబ్‌లో వ్యవసాయశాఖ ఏడీఏ దామోదర్, ఏఓ వినయ్, సీఐ రత్నం, ఎస్ఐ మహ్మద్‌అంజద్ తనిఖీలు నిర్వహించారు. రూ.7.59 లక్షల పత్తి, వరి విత్తనాలకు సంబంధించి స్టాక్ వివరాలు నమోదు చేయనందున విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు వారు తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని వ్యాపారులకు హెచ్చరించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ఆత్మకూర్, అమరచింత మండల కేంద్రాల్లోని ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి వినయ్ తెలిపారు. 30 కేజీల జీలుగ విత్తనాల బస్తాకు 65 శాతం సబ్సిడీ పోను రూ.843 ధరకు రాష్ట్ర ప్రభుత్వం విక్రయిస్తుందన్నారు.

పాన్‌గల్: ఎరువుల దుకాణాల ద్వారా నకిలీ విత్తనాలు విక్రయించిన, రైతులను మోసం చేసిన డీలర్లపై కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో విత్తన, ఎరువుల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. ఎరువులను తప్పనిసరిగా ఈ-పాస్ మిషన్ ద్వారా అమ్మలని ఆదేశించారు. కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ ఏఓ సాజిద్‌రెహ్మాన్, డీలర్లు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

వీపనగండ్ల: ఆరుగాలం శ్రమించే రైతులకు నష్టం కలిగించే విధంగా నకిలీ విత్తనాలు అమ్మే ఎరువుల దుకాణదారులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్, ఎస్ఐ రామన్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే ఎరువుల దుకాణదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

గోపాల్‌పేట: రైతులకు కల్తీ విత్తనాలు, ఎరువులు అమ్మితే ఫర్టిలైజర్ షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వనపర్తి జిల్లా సహాయ సంచాలకులు సత్యంబాబు, తెలంగాణ సీడ్స్ ఆఫీసర్ తరుణ్‌రెడ్డి అన్నారు. గురువారం వారు మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులతో పాటు బుద్దారంలోని ఫర్టిలైజర్ షాపుల్లో గోపాల్‌పేట మండల వ్యవసాయ ఇన్‌చార్జ్ అధికారి అనిల్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేని విత్తనాలు అమ్మితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్ పరిశీలించారు.



వీపనగండ్లలో..



ఆత్మకూర్‌లో..



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కొనసాగుతున్న 'ఆధార్' అప్‌డేట్ కార్యక్రమం

పాన్‌గల్: మండలంలో 'ఆధార్ అప్‌డేట్' కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం మండలంలోని శాగాపూర్‌తండాలో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్ కార్యాక్రమాన్ని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ కార్డు పొంది పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి జీపీ భవనంలో అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమాలమ్మ, వీఆర్ఏ అరుణ, బీఆర్ఎస్ నాయకులు నిరంజన్, శంకర్, ఆధార్ కేంద్రం నిర్వాహకుడు తిరుపతయ్య పాల్గొన్నారు.



ఆధార్ అప్‌డేట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో గురువారం రైతులకు 65శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలను డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సంచాలకులు చంద్రశేఖర్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు వెంకటయ్యానాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొలంలో జీలుగ విత్తనాలు సాగు చేసి పూతదశలో నేలలో కలియ దున్నడంతో భూమి సారవంతమై పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, సెల్ నెంబర్‌తో కార్యాలయంలో సంప్రదించి విత్తనాలు పొందవచ్చన్నారు. 30 కేజీల బస్తా సబ్సిడీ పోను రూ. 843 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, ఏఓ సాజిద్ రెహ్మాన్, సీఈఓ భాస్కర్‌గౌడ్, ఏఈఓ నరేష్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో విఫలం

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గ్రామ సభ తీర్మాణం చేసి జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేసినా ఫలితం లేదని తండా సర్పంచ్ శాంతమ్మ అసహనం వ్యక్తం చేశారు. గురువారం తండావాసులతో కలిసి ఆమె కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తండాలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించాలని గ్రామ సభ ద్వారా ఏకగ్రీవ తీర్మాణం చేసి జిల్లా, మండల స్థాయి అధికారులకు విన్నవించినా ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తూ సమస్యలను పరిష్కరించడం లేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విద్యుత్ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే తండావాసులతో కలిసి ఈనెల 22వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు.



తండాలో ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ శాంతమ్మ

జూపల్లిని విమర్శించే స్థాయి లేదు

చిన్నంబావి: జూపల్లిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, ఆయన అనుచరులకు గానీ లేదని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులు మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, సర్పంచ్ సురేందర్‌సింగ్ అన్నారు. గురువారం పెద్ద దగడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దదగడ శివారులో సర్వే నెంబర్ 195లో 19 కుంటల భూమిని బీరం అనుచరులు అక్రమించి రాత్రి సమయంలో అక్రమ కట్టడాలు చేపట్టడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కింది స్థాయి అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తద్వారనే 6వ తేదీన కలెక్టర్ పిలిచారని తెలిపారు. గ్రామపంచాయతీ అనుమతులు లేకుండానే జెడ్పీటీసీ ఇంటి నిర్మాణం చేపట్టారని, దానిపైన కూడా త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో బీచుపల్లి యాదవ్, చిన్నంబావి సర్పంచ్ రంజిత్‌కుమార్, శంకర్‌యాదవ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

కాల్వలో జమ్ము తొలగింపు



వీపనగండ్ల: జూరాల, భీమా కాల్వల్లో ఏపుగా పెరిగిన జమ్మును తొలగించడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. బుధవారం తూంకుంటలో జూరాల కాల్వలో పెరిగిన జమ్మును తొలగిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలు నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, శ్రమకు తగ్గ కూలీని అందివ్వడంలో ఉపాధి సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. కూలీలకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత ఈజీఎస్ అధికారులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శేఖర్‌గౌడ్, పలువురు ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న జిల్లా అధికారి సురేందర్

పాన్‌గల్: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలల సంరక్షణ జిల్లా అధికారి సురేందర్ అన్నారు. గురువారం మండలంలోని మల్లాయిపల్లిలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల లోపు ఉన్న బాలబాలికల రక్షణ కోసం, స్నేహపూర్వక, సురక్షితమైన వాతావరణంలో పెరగడం కోసం ప్రతి గ్రామంలో బాలల సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీల ద్వారా గ్రామాల్లో బాల్య వివాహాల నివారణ, బడిఈడు పిల్లలను బడికి పంపించడం, బాల కార్మిక వ్యవస్థను అరికట్టడం, బాలలపై వేధింపుల లేకుండా చూడటం కమిటీల ముఖ్య బాధ్యతలు అని వివరించారు. బాలలకు సమస్యలు వచ్చినా.. వేధింపులకు గురిచేసిన వెంటనే కమిటీలు పోలీసులకు, అధికారులకు తెలియపర్చాలన్నారు. కార్యక్రమంలో ఔటు రీచ్ వర్కర్ నరేందర్, సర్పంచ్ జయకళ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్‌కు ప్రమాదం

వీపనగండ్ల: మండలంలోని బొల్లారంలో గురువారం వరిగడ్డిని ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా గ్రామంలో నేలవాలిన విద్యుత్ వైర్లకు తగిలి షాట్‌సర్క్యూట్‌కు గురై వరిగడ్డి కాలి బూడిదయింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కావలి సుదర్శన్ తన పొలం నుంచి వరిగడ్డిని గ్రామ సమీపంలోని గడ్డిదొడ్డికి తరలిస్తుండగా బస్టాండ్ సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు నేలవాలి ఉండడంతో షాట్‌సర్క్యూట్‌కు గురై నిప్పంటుకుంది. డ్రైవర్ శ్రీకాంత్, గ్రామస్తులు చాకచక్యంగా వ్యవహరించి గడ్డిని ట్రాక్టర్ నుంచి వేరు చేయడంతో ట్రాక్టర్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. దగ్ధమైన గడ్డి విలువ రూ.20 వేలు ఉంటుందని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని బాధితుడు కోరారు.

డీలర్లకు గౌరవ వేతనం అమలు చేయాలి

వీపనగండ్ల: ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న డీలర్లకు గౌరవ వేతనాన్ని అందజేయాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ పాండునాయక్‌కు మండలంలోని డీలర్లు వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశాల సమయంలో రేషన్ డీలర్లకు వేతనం అందజేస్తామని, అందుకు సంబంధించిన జీఓను కూడా వెంటనే ప్రకటిస్తామని తెలియజేశారని, కానీ నేటికీ ఆ జీఓ విడుదల కాలేదని వాపోయారు. దీంతో తాము చాలీచాలని జీవితాలతో కాలం వెళ్లదీస్తున్నామని డీలర్ల సంఘం నాయకులు బస్వరాజ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, సింగయ్య శెట్టి అన్నారు. గౌరవ వేతనానికి సంబంధించిన జీఓను విడుదల చేయాలని, లేకుంటే వచ్చే నెల 5వ తేదీ నుంచి సమ్మె చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నారాయణగౌడ్, సువర్ణ, లక్ష్మయ్య యాదవ్, నాగయ్య, వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీలర్ల సంఘం నాయకులు

వేసవి తాపానికి గురికావొద్దు

అమరచింత: ప్రస్తుతం రోజురోజుకూ ఎండలు మండుతున్నాయని, రోజు వారీగా 41 డిగ్రీల పైచిలుకు ఉష్ణోగ్రత నమోదవుతుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా అన్నారు. పట్టణంలోని దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం బాటసారులతో పాటు చల్లటి మంచి నీటిని తాగేందుకు వస్తున్న వారికి వేసవి ఎండల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈమేరకు కలాంపాషా మాట్లాడుతూ శరీరం డీహైడ్రేట్ కాకుండా నీటి శాతం ఎక్కువగా ఉన్న కూరలు తినాలన్నారు. భోజనంలో సోర, బీర, దోసకాయ, ఆకుకూరల వంటకాలు ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. కీరదోస, పుచ్చకాయ, దానిమ్మ, కర్బూజ లాంటి పండ్లు అధికంగా తినాలన్నారు. వేసవిలో చల్లదనం కోసం మద్యం తాగితే శరీరం త్వరగా డీహైడ్రేట్ అవుతుందన్నారు. దీంతో త్వరితంగా అనారోగ్యంకు గురి అయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు వీటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు సర్దార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న కలాంపాష

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూర్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో వైద్యం, వ్యవసాయం, విద్య, పౌరసరఫరాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఐసీడీఎస్, తాగునీరు, ఉపాధిహామీ, పశువైద్యం తదితర శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష కొనసాగుతుందని అన్నారు. సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరు అవుతారని, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ హాజరు కావాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

గోపాల్‌పేట: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గోపాల్‌పేట ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన మండలంలోని బుద్దారంలో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు వచ్చే ప్రతి లింకునూ ఓపెన్ చేయరాదన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్‌కాల్ చేస్తున్నామని ఓటీపీలను చెప్పమని అడిగితే చెప్పకూడదని చెప్పారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



నాగల్‌కడ్మూర్‌లో నూతన పంచాయతీ భవనం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌కుమార్



వెంకటాంపల్లిలో పంచాయతీ భవనం పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని తిర్మలాయపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన ఆయాగ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనుల గురించి ఆరా తీశారు. వెంకటాంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పంచాయతీ కార్యదర్శులు ఉదయం 7 గంటల వరకు గ్రామాలకు చేరుకుని గుర్తించిన పనులను చేయించాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బందితో పాటుగా అవసరమైతే ఉపాధి కూలీలను ఉపయోగించుకోవాలన్నారు. గుంతలు పూడ్చడం, పిచ్చిమొక్కలు తొలిగించడం, డ్రెయినేజీలు తీయించడం, రోడ్లు శుభ్రపర్చడం తదితర పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గుర్తించిన పనులు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ ఆదేశించారు.

వీపనగండ్ల: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తూంకుంటలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఎస్సీ కాలనీలో ఏపుగా పెరిగిన కంపచెట్లను జేసీబీ ద్వారా తొలగించాలని ఆయన ఆదేశించి వెంటనే పనులను ప్రారంభింపచేశారు. గ్రామప్రధాన వీధుల్లోని డ్రెయినేజీల్లో ఉన్న చెత్తను, మురుగును వెంటనే తొలగించాలని ఆయన పంచాయితీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న గోడలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ మానస, పంచాయితీ కార్యదర్శి వహీద్ పాల్గొన్నారు.

అమరచింత: గ్రామాలను స్వచ్ఛ గ్రామలుగా తీర్చిద్దడంతో పంచాయతీ కార్యదర్శులతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉండాలని డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌ను గురువారం సందర్శించి గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అదే విధంగా పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌తో కలిసి నూతన పంచాయతీ కార్యాలయం భవనం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు డీపీఓ మాట్లాడుతూ గ్రామంలో నూతన జీపీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయని, దీంతో శిథిలావస్థలో ఉన్న జీపీ భవనం కూల్చి వాటి స్థలంలోనే కొత్త భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి ఎండలు ముదురుతున్న సందర్భంలో గ్రామాల్లో ఉన్న నర్సరీలకు గ్రీన్ నెట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం నర్సరీలోని మొక్కలకు నీటిని అందించాలని వాచర్‌ల దినచర్యలను గమనించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు: బీఆర్ఎస్‌తోనే పలు సంక్షేమ పథకాలు అమలయ్యాయని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. స్థానిక బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనుల కోసం రూ.25.31 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, కొన్ని పనులు పూర్తి కావచ్చాయని, మరికొన్ని ప్రగతిలో ఉన్నాయన్నారు. గ్రామాల్లో ఎక్కడా మట్టి రోడ్లు కనిపించకుండా సీసీరోడ్ల కోసం రూ.2.65కోట్లు ఖర్చు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీడు భూములుగా ఉన్న భూములు నేడు పచ్చదనంగా మారాయంటే అందుకు సీఎం కేసీఆరే కారణమన్నారు. పస్పుల గ్రామానికి చెందిన రైతులకు సాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే తన సొంత ఖర్చులతో 500 ఎకరాలకు మినీ లిఫ్టును ఏర్పాటు చేసి సాగునీరు అందించానని తెలిపారు. మాచుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, నాగులపల్లి, బావాయిపల్లిలో కొత్త బ్రిడ్జిలను మంజూరు చేశామన్నారు. సోమశిల సిద్దేశ్వరం జాతీయ రహదారిని సాధించుకున్నామని, రైతుల శ్రేయస్సు కోసం చివరి ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యంగా సింగోటం, గోపల్‌దిన్నె లింక్ కెనాల్ మంజూరు చేశామన్నారు. మండలంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, రాజశేఖర్‌గౌడ్, రఘువర్ధన్‌రెడ్డి, సోమనాథ్‌నాయక్, జగన్మోహన్‌రెడ్డి, చిన్నారెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.